


# సౌదామిని

చిత్తూరు కోటేశ్వరరావు
(ఐ.పి.ఎస్.)

అతను గీచిన చిత్రాలు, వేసిన వర్ణ చిత్రాలు తను విద్యార్థి దశ నుంచి చూస్తూనే ఉంది. అప్పటి నుంచి అతని అభిమానిగా మారి అతన్ని ఆరాధిస్తూనే ఉంది. ఎప్పటినుంచో అతన్ని కలవాలని, అతని ఆటోగ్రాఫ్ తీసుకోవాలన్న తన కోరిక ఈనాడు నెరవేరింది.

మూర్తి అదే ఊరికి కొత్తగా వచ్చిన ఫారెస్ట్ ఆఫీస రని తెలిసి మరింత సంతోషించింది.

అతన్ని ప్రతి రోజూ కలవాలని, అతనితో మాట్లాడాలని ఆమె మనసు తహతహలాడుతూంది.

స్త్రీగా తను చొరవ తీసుకుంటే అత డేమనుకుంటాడోనన్న సంశయం ఒకవేపు, తమ పరిచయాన్ని లోకం తప్పు పడుతుందేమోనన్న భయం మరోవేపు

సింధూ ఆరోగ్యం రోజు రోజుకీ క్షీణించిపోతూంది. ఎన్ని మందులు వాడినా, ఎంతమంది డాక్టర్లకు చూపించినా ఫలితం లేకుండా పోతూంది. కన్నతల్లిగా డాక్టర్ సౌదామిని తను చేయవలసిందంతా చేసింది. అయినా కూతురి పరిస్థితికి కలవరపడుతూంది.

మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ అరుణ చెప్పినట్లు ఆ చిన్నారి మనసు ఎక్కడో గాయపడింది.

ఆ గాయం ఏమిటో తన కొక్క దానికే తెలుసు. ఆ గాయానికి నాంది ఏడు సంవత్సరాల క్రిందట జరిగిన సంఘటనేనని ఆ చిన్నారి మనసుకు ఎలా చెప్పేది?

* * *

ఆ రోజు ఆగస్టు 15.

శృంగవరపుకోటలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్బులో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.

[illegible]
అతిథిగా వచ్చారు. డాక్టర్ సౌదామినిని బహుమతి ప్రదానం చేయడానికి ఆహ్వానించారు. ఫంక్షన్ ఆహ్లాదకరంగా ముగిసింది.

తను ఎంతో ఆరాధిస్తున్న చిత్రకారుడు ఆ రోజు ఫంక్షన్‌లో ముఖ్య అతిథిగా ఉన్న మూర్తేనని [illegible]

ఉండనే ఉన్నాయి. అయినా ఆమెలోని కళాభిమాని అవేమీ లేక్క చేయలేదు.

ధైర్యం చేసి తనే మూర్తిని కలవాలని, మనసు

విప్పి తన అభిమానాన్ని అతనికి తెలియజెప్పాలని నిర్ణయించుకుంది.

ఆ రోజు ఔట్ పేషెంట్స్ అందర్నీ తొందర తొందరగా పరీక్ష చేసి డ్యూటీ అయిం దనిపించి వడివడిగా మూర్తి బంగ్లాకు బయలుదేరింది.

ఆ బంగ్లాలో అడుగుపెట్టిన సౌదామినికి అక్కడ ఎవరూ లేకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది. తను మూర్తితో ఏకాంతంగా మాట్లాడబోతున్నందుకు తనని తానే అభినందించుకుంది. గర్వంగా తను కట్టుకున్న పట్టుచీరను ఒకసారి ఆసాంతం చూసుకుంది. పర్వాలేదు తనకు తగ్గట్టుగానే చీర, బ్లౌజు కుదిరాయి అనుకుంది.

ఇంట్లో అడుగుపెట్టి ఒక్కసారి ఇల్లంతా కలయజూసింది.

అక్కడ మూర్తి ఉన్న జాడ ఏమీ కనిపించక క్షణం నిరుత్సాహానికి గురయింది.

పెరటిలో ఉన్న పచ్చిక మైదానంలో ఏకాగ్రతతో అతడు కుంచె పట్టుకుని చిత్రం గీస్తున్నాడు.

క్షణం ఆమె గుండె లయ తప్పి కొట్టుకుంది. అతన్నే తదేకంగా చూస్తూ అనిర్వచనీయమైన అనుభూతికి లోనయింది.

"కూర్చోండి..." అన్న మూర్తి మాటతో ఉలిక్కిపడి పరీక్షగా చూసింది.

అతడు తన బొమ్మనే గీశాడని తెలుసుకోగానే ఆమె బుగ్గలు కెంపు లయ్యాయి.

ఒకసారి తనని చూసి అంత సజీవంగా చిత్రించిన అతడి కళా నైపుణ్యాన్ని అభినందించకుండా ఉండలేకపోయింది.

ఆమె అభినందలు అందుకున్న మూర్తికి ఆమె ఆ క్షణంలో దేవకన్యలా కనిపించింది.

ఆ స్ఫూర్తితోనే అతడు తన కుంచెకు పని కల్పించాడు. తర్వాత వారు తరచు కలుసుకోసాగారు. అనతి కాలంలోనే అతడు గీసిన ఎన్నో చిత్రాలకు ఆమె మోడల్ అయింది.

ఇద్దరి మధ్య అనుబంధం పెరిగింది. ఒకరిని చూడకుండా ఒకరు ఉండలేని స్థితికి వచ్చారు.

అతడే తన సర్వస్వం అని నమ్మిన సౌదామిని తన సర్వస్వాన్ని అర్పించుకుంది.

సరిగ్గా అప్పుడే ఆ ఊరిలో రకరకాల పుకార్లు పుట్టాయి.

అప్పటికి తనకు నెల తప్పినట్లు సౌదామిని గ్రహించింది. విషయం తెలుసుకున్న మూర్తి హడావిడిగా వచ్చాడు.

అతనికి ఆ ఊరి నుంచి బదిలీ అయింది. కారణం అతని మామ. ఇద్దరి మధ్య జరుగుతున్న ప్రేమకలాపాలు తెలుసుకున్న అతని శ్రీమతి పుట్టింటినుంచి రోజుల పిల్లాడిని వేసుకుని సరాసరి చెప్పాపెట్టకుండా శృంగవరపుకోట చేరింది. వెంటనే కొత్త ఊరికి వెళ్లడానికి సామానంతా సర్దించింది.

విషయం తెలుసుకున్న సౌదామిని క్షణం ఖిన్నురా లయింది. తనకు తాను నచ్చచెప్పుకోవడానికి ప్రయత్నిస్తున్న తరుణంలోనే మూర్తి నిర్ణయం అశనిపాత మయింది.




"పెళ్లి కాకుండా తల్లి కావడాన్ని ఎవరూ హర్షించరు. చేతిలో ఉన్న విద్య నుపయోగించి అబార్షన్ చేయించుకో..."

అతని మాటలు వినలేనట్టు చెవులు మూసుకుంది. అతడు ఆమెను అబార్షన్‌కు ఒప్పించాలని ఎంతో ప్రయత్నించాడు. మరెవరైనా వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుని గతం మరచి కొత్త జీవితాన్ని ప్రారంభించమని సలహా ఇచ్చాడు.

అతని సలహా విని తట్టుకోలేకపోయింది సౌదామిని. వస్తున్న కోపాన్ని పళ్ల బిగువున అదిమిపట్టింది.

అతను ఆమెను బ్రతిమాలుతున్నాడు.

"ప్లీజ్! దయచేసి ఇంకొక్క మాట కూడా మాట్లాడవద్దు. మీరు గృహస్థులని తెలుసు. మీకు భార్యా పిల్లలు ఉన్నారనీ తెలుసు. అయినా నేను మిమ్మల్ని మనస్ఫూర్తిగా ప్రేమించాను. మీ రది ప్రేమ అనుకున్నా వ్యామోహం అనుకున్నా అది మీ ఇష్టం. నేను మనస్ఫూర్తిగానే నన్ను మీకు అర్పించుకున్నాను. ఫలితం నాకు తెలుసు.

"సూత్రం కట్టనంత మాత్రాన మన బంధం అపవిత్రమని నే ననుకోను. బిడ్డను కంటాను. నా బిడ్డను పెంచి పెద్ద చేస్తాను. ఆ ధైర్యం నాకుంది. ఆపాటి ఆర్థిక స్వాతంత్ర్యం కూడా ఉంది. అంతేకాని మీ మాట విని అబార్షన్ చేయించుకుని ఇంకో కొత్త వ్యక్తి జీవితంలో ప్రవేశించి నన్ను నటించమంటారా? అది నా వల్ల కాదు. అలా అని నేను నా హక్కుల కోసం పోరాడతానని, మీకు సమస్యలు సృష్టిస్తా ననుకోవద్దు. తప్పో ఒప్పో అన్నీ నేనే అనుభవిస్తాను. మీ ఛాయలకు రాను. మీ పేరు గాని, మీ నీడగాని నా బిడ్డ మీద పడకుండా పెంచుతాను..." ఆవేశంగా అంది సౌదామిని.

అతడు ఆమె తీసుకున్న నిర్ణయానికి ఖిన్నుడైపోయాడు.

"సౌదామినీ! జీవితం నువ్వనుకున్నంత సాఫీగా జరిగిపోదు. రేపు నీకు పుట్టిన బిడ్డ తన జన్మకు కారకు డెవరని నిలదీసి అడిగితే ఏం సమాధానం చెబుతావు? లోకులు కాకుల్లా నిన్ను నీ బిడ్డను పొడుచుకు తింటారు. ఈ సమాజం నిన్ను నీ బిడ్డను ప్రశాంతంగా బ్రతకనివ్వదు. చేసిన తప్పును సరిదిద్దుకునే అవకాశం అప్పుడు నీకుండదు. మరొక్కసారి ఆలోచించు..." ఆవేశంగా హెచ్చరించి వెనుదిరిగాడు.

అవును! అతను అన్న మాటల్లో తప్పులేదు. అతను సగటు మనిషి కనుక అలానే ఆలోచించాడు.

తన పరిస్థితుల్లో ఇంకో స్త్రీ ఉంటే మూర్తి సలహా పాటించి అబార్షన్ చేయించుకుని ఇంకో వ్యక్తితో జీవితాన్ని పంచుకునేదేమో!

కాని తన మనసు అందుకుససేమిరా అంగీకరించడం లేదు. ఆత్మవంచన చేసుకుని జీవితం గడపడం కంటే, ఆత్మస్థైర్యంతో ముందుకు పోవడమే తన ఆదర్శం అనుకుంది.

ఆ రోజు ఇద్దరూ చివరిసారిగా కలుసుకున్నారు. తరువాత ఇద్దరు దారులు వేరైనాయి.

సౌదామిని చేసిన పనికి లోకమే కాదు, చివరికి బంధువర్గం కూడా అసహ్యించుకుంది. తల్లి, తండ్రి మౌనంగా ఉండిపోయారు- ఆమెను మందలించే శక్తి వారికి లేదు గనుక. వాళ్ల దృష్టిలో సర్వం తెలిసిన పెద్ద డాక్టర్.

అందరూ ఆమెను ఛీ కొట్టినా కన్నవాళ్లు ఆమె కష్టాలను గుర్తించారు. ఆమెకు ఇంకో మూడు మాసాలకు డెలివరీ వస్తుందని తెలిసి ఢిల్లీలో ఉన్న గెస్ట్ హౌస్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఆమెకు తోడుగా రాములమ్మ అనే పని మనిషిని ఉంచారు.

డెలివరీ అయి పాప పుట్టిన తరువాత ఆమె సందిగ్ధంలో పడింది. ఉద్యోగం చేయాలా, వద్దా? అన్న మీమాంసలో ఉంది. 'పిరికిది. ఉద్యోగం మానేసింద'ని ఈ సమాజం మరింతగా కుళ్లబొడుస్తుందన్న నగ్నసత్యాన్ని ముందుగానే గ్రహించగలిగింది.

వైద్య వృత్తిలో పడి అన్నీ మరచిపోవాలనుకున్నా ఆమె మనసు నుంచి మూర్తి రూపం చెదరిపోలేదు. అతడిని మరచిపోవాలన్నా మరచిపోలేకుండా ఉంది. అతడు ఆదిలాబాద్ బదిలీ అయ్యాడని తెలుసుకుంది. అచ్చు అతని పోలికల్లో ఉన్న తన పాపను అతడు చూస్తే ఎంతో ఆనందిస్తా డనిపించింది. కాని ఆమె ఆలోచనలు అంతకుమించి ముందుకు సాగలేకపోయాయి.

మళ్లా అంతా రొటీన్ - డ్యూటీ - ఇల్లు - సింధూ. ఒక్కొక్కప్పుడు ఆ జీవితం భరించలేనంత కష్టంగా అనిపిస్తుంది.

సింధూకి మూడవ సంవత్సరం రాగానే కాన్వెంట్‌లో చేర్పించాలని నిర్ణయించుకుంది.

అప్లికేషన్‌లో తండ్రి పేరు ఏం రాయాలో క్షణం తటపటాయించి, చివరికి తన పేరే రాసింది.

అది చూసి ప్రిన్సిపాల్ ఆమె ముఖం కేసి

ఎగాదిగా చూసింది. అన్నింటికీ తను సిద్ధపడి వచ్చింది. అంచేత తనేమీ పట్టించుకోలేదు.

కాలం యథావిధిగా గడిచిపోతోంది. ఒక రోజు యాదృచ్ఛికంగా విశాఖలో జగదాంబ సెంటరులో మూర్తి కనిపించాడు.

అతన్ని పలకరించాలన్న ఆరాటం. కాని అంతలోనే వైరాగ్యం. ఆమె ఆలోచిస్తూండగానే అతను కనుమరు గయ్యాడు. దూరంగా భార్యా పిల్లలతో వెళుతున్న మూర్తిని చూసి భారంగా నిట్టూర్చింది.

అతని పరిస్థితికి జాలి పడింది. తనని చూసి కూడా చూడనట్లే వెళ్లిపోయాడు. అదేనా జీవితం అనిపించింది. వ్యక్తిత్వం లేని వ్యక్తుల మీద ఆమె కా క్షణంలో చీదరింపు కలిగింది.

ఆలోచనలు ఆమెను వెంటాడి వేధిస్తున్నాయి. మూర్తి చెప్పినట్టు చేయనందుకు తనను చూసి తనే గర్వపడింది. తన వ్యక్తిత్వం కాపాడుకునా నన్న ఆత్మ సంతృప్తి మిగిలిం దామెకు.

సింధూకి బాగా ఊహ వచ్చింది. తన చుట్టూ ప్రపంచాన్ని అర్థం చేసుకోగల తెలివితేటలు ఉన్నాయి.

సింధూకి ఏడేళ్లు రావడంతో విశాఖకు బదిలీ చేయించుకుని, కూతుర్ని బళ్లో చేర్పించింది సౌదామిని.

ఆ కాన్వెంట్‌లో చేరినప్పటి నుంచి సింధూలో నిర్లిప్తత ఎక్కువయింది.

దానికి తగ్గట్టు తను హాస్పటల్ డ్యూటీలో పడి ఆమె ఆలనా పాలనా అంతా రాములమ్మకే అప్పజెప్పింది. కాలక్రమేణ తల్లి - కూతురి మధ్య ఆ దూరం అనేకానేక ఆలోచనలకు దారి తీసింది. సింధు ఒంటరిగా ఏవేవో ఊహించుకుంటుంది. ఆమె ఆరోగ్యం క్షీణించడం గమనించేప్పటికే చాలా ఆలస్యం అయిపోయింది.

అప్పటికే సింధూ చిక్కి శల్యమైపోయింది. సింధూ స్కూలుకి వెళ్లడంలేదని రాములమ్మ ఫిర్యాదుతో తన తప్పును తెలుసుకుంది సౌదామిని.

తల్లి నిలదీసి అడిగినప్పుడు సింధూ మౌనంగా ఉండిపోయింది. ఆ మౌనం ఆమెను మరింత బాధపెట్టింది.

ఆ రోజు తనే దగ్గరుండి కారులో సింధూని కాన్వెంటు తీసుకువెళ్లింది.

సింధూ క్లాసుకు వెళ్లనని మొరాయించడంతో పాటు ఏడ్వడంతో కాన్వెంటు అంతా ప్రతిధ్వనించింది.

సౌదామిని కోపం ఆపుకోలేక సింధూని చెంపమీద కొట్టింది.

అనుకోని చర్యకి అంతా ప్రూన్పడిపోయారు. ఎంత ఆపుకోవాలన్నా సౌదామినికి దుఃఖం ఆగలేదు.

చివరికి సిస్టర్ ఆమెను సముదాయించడం చూసింది సింధూ.

"అమ్మా! నేను ఈ కాన్వెంటుకు వెళ్లను. నా ఫ్రెండ్స్ అందరికి డాడీ ఉన్నారు. నాకు నాన్న లేరని వాళ్లంతా నన్ను ఆట పట్టిస్తున్నారు. నిజం చెప్పమ్మా? నాకు నాన్న లేరా?" సింధూ సూటిగా వేసిన ప్రశ్నకి అవాక్కయింది సౌదామిని.

వెంటనే ఏం సమాధానం చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయింది.

అక్కడ నుంచి సింధూని తీసుకుని వడివడిగా కారు దగ్గరకి కదిలింది.

ప్రిన్స్‌పాల్‌తో పాటు మిగిలిన టీచర్లు అంతా వాళ్లిద్దరినే వింతగా చూడ్డం మొదలుపెట్టారు.


** ** **

సింధూకి జ్వరం వచ్చింది. ఆ జ్వరంలో పలవరింతలు ఎక్కువయ్యాయి.

డాక్టరు అరుణ కొన్నాళ్లు ఈ పరిసరాలు మారితే బావుంటుందని సలహా ఇచ్చింది.

సౌదామిని ఆమె సలహాను పాటించి, సింధూని తీసుకుని ఊటీ వెళ్లింది. కాని ఫలితం లేకపోయింది. సింధూ పరిస్థితి మరింత క్షీణించింది.

తను తప్పు చేశానేమోనని తొలిసారిగా బాధపడింది సౌదామిని.




తన జీవితాన్ని తను శాసించుకునే హక్కు తన కుంది. కాని ఏ పాపం ఎరుగని, అభం శుభం తెలియని పసిపిల్ల సింధూ. తనవలన, తను తీసుకున్న నిర్ణయం వలన తండ్రి ప్రేమకు దూరమయింది.

** ** **

డాక్టరు అరుణ సూచించినట్లుగా ప్రస్తుతం సింధూకి తండ్రి ఆదరణ, అనురాగం కావాలి. అంచేత తన ఓటమిని అంగీకరించి మూర్తిని ప్రాధేయపడాలి. ఒక్కసారైనా సింధూని తన బిడ్డగా గుర్తించి తండ్రి ప్రేమ, అనురాగాలను ఒక్క క్షణమైనా పంచి ఇచ్చి తన బిడ్డ ప్రాణాలను కాపాడమని ప్రాధేయపడాలని నిర్ణయించుకుంది.

అర్ధరాత్రి ఫోను మ్రోగుతుంటే వినుగ్గా రిసీవ రెత్తాడు మూర్తి.

"ట్రంకాల్ ఫ్రమ్ విశాఖ."

అతని మత్తు క్షణంలో వదిలిపోయింది.

విశాఖ నుంచి తనకు ట్రంకాల్ చేసే వా ళ్లెవరూ లేరు. ఉన్నదల్లా తన ప్రియాతిప్రియమైన సౌదామినియే.

కాని ఏడు సంవత్సరాలుగా తనతో మాట్లాడడానికి కూడా ఇష్టపడని సౌదామిని ఫోన్ చేస్తుందా అన్న మీమాంసలో పడ్డాడు.

అవతలివేపు నుంచి గొంతు వినబడింది.

ఆ గొంతు అతను పోల్చుకోగలిగాడు.

తన సౌదామిని తిరిగి ఇన్నాళ్లకు తనతో మాట్లాడుతుందన్న భావనే అతని మనసంతా ఆనందంతో నిండిపోయింది.

ఫోనులో మాటలు వినబడకపోవడంతో "మూర్తిగారు ఉన్నారా..." ఆత్రతగా రెట్టించి అడిగింది.

"నేనే సౌదామినీ... మాట్లాడుతున్నాను..." అతని గొంతు దాటి మాటలు అతి కష్టంమీద వచ్చాయి.

"నన్ను వెంటనే గుర్తు పట్టినందుకు సర్వదా కృతజ్ఞురాలిని. దయచేసి మీరు వెంటనే అరుణా నర్సింగ్ హోమ్‌కి రాగలరా..." ఆమె గొంతు మూగబోయింది.

మూర్తికి విషయం అర్థం కాలేదు.

"హలో... హలో..." అతను ఫోనులో విషయం తెలుసుకోవడానికి ప్రయత్నించాడు.

అప్పటికే సౌదామిని ఫోన్ పెట్టేసింది.

ఏడు సంవత్సరాల తరువాత సౌదామిని తనతోటి మాట్లాడిందన్న ఆనందం కన్నా ఆమె ఏ పరిస్థితుల్లో ఉండి తనని ఆసుపత్రికి రమ్మందోనన్న ఆందోళన ఎక్కువయింది మూర్తికి.

ఆత్మాభిమానం గల సౌదామిని ఎంతో అవసరం లేకపోయే తనను ప్రాధేయపడదని గ్రహించాడు.

ఆమె కోరినట్లే ఆసుపత్రికి బయలుదేరాడు.

కానీ... కానీ...

కొన్ని క్షణాల క్రితమే అంతా అయిపోయింది.

సింధూ శవం మీద పడి భోరున విలపిస్తున్న సౌదామినిని చూసి మూర్తి కళ్లు చెమ్మగిల్లాయి. ★